# శవం విలువ

ఆవేళ తన విద్యుక్తధర్మం నెరవేర్చటానికి ట్రాఫిక్ పోలీస్ కాన్‌స్టేబిల్ 202 - పేరు వీరయ్య - సరిగా అయిదున్నరగంటలకే సెంటరుకొచ్చి ఎదురుగా కనపడుతున్న హోటల్‌లోకివెళ్ళి కాఫీ తాగాడు. ఆరింటికి పత్రికల కుర్రాళ్ళు కేకలేసుకుంటూ సెంటరులో అమ్ముతున్నారు. వీరయ్య ఎర్రటోపీ ఒక్కసారి తలనుంచి తీసి తుడిచి, మళ్ళీ నెత్తిన పెట్టుకొని, పత్రికలోని పెద్ద శీర్షికలు మాత్రం చదివి, రోడ్డునడిమధ్య వున్న గొడుగు దగ్గిరకెళ్ళి నుంచున్నాడు.

నుంచున్న వాడల్లా ఒకసారి చుట్టూచూచాడు. ఏ వంకనైనా ప్రజలు గుమిగూడి ట్రాఫిక్‌కు అడ్డం వుండకుండా చూసుకోవాల్సినపని వుందిగదా! అదీ అతనిక్షోభ. దానికి తగ్గట్టే పంటకాల్వమీద వంతెన మొదటగల పేవ్‌మెంట్ మీద జనం కొద్దిగా గుమిగూడి వున్నారు. దేన్నో చాలా ఆసక్తిగా చూస్తున్నారు. ఏడెనిమిదిమంది, ఐదారుగురు పిల్లలు పెద్దలు అడ్డం వుండడంతో ఎగిరి ఎగిరి చూస్తున్నారు.

పోలీసుకీ దృశ్యం చికాకనిపించక మానదు. వొంతెన అసలే చిన్నది, దానిగుండా కార్లురావాలె... ఎట్లాగా?....

వీరయ్య చప్పున, జేబులోనించి ఈలదీసి ఊదుతూ, వెళ్ళాడు గుంపు దగ్గిరకు.

అతన్ని చూడగానే ప్రేక్షకులు పక్కకుతప్పుకున్నారు కొందరు చల్లగా జారుకున్నారు. పిల్లలు పారిపొయ్యారు. తూర్పునుంచి పడుతున్న లేయెండపొడలో ఒక శవాన్ని పడుకోబెట్టి; ఇద్దరు స్త్రీలు గోడుగోడున ఏడుస్తున్నారు. శవంమొగా, ఆడా అని తెలియటం లేదు. నిలువునా ఓ పాతగుడ్డ కప్పారు; ఆ గుడ్డమీద పసుపూ కుంకుమ చల్లారు శవం పక్కన, రెండువేపులా కాన్లూ, అణాకాసులూ పడి ఉన్నాయి.

ఏడుస్తున్న ఆడవాళ్ళనీ, శవాన్నీ చూశాక పోలీసు వీరయ్య కొంచెం వెనకాడాడు. ఎవరికైనా వొచ్చే ప్రమాదమేకదా అది. అతను '' ఏమిటమ్మా ఇది, ఇక్కడ'' అని మృదువుగా అన్నాడు చేతిలో లాఠీ తిప్పుతూ.

ఇద్దరు స్త్రీలలోను వయసులో ఉన్న అమ్మాయి '' మా బాబు చనిపోయిండు బాబయ్యా, తగలెయ్యాల్నా! నలుగుర్నీ అడుక్కొని పోతం!'' అన్నది చాలా హీనస్వరంలో

పోలీసు, నమలలేకా మింగలేకా, ఏదోగొణుక్కుంటూ వెళ్ళాడు తన స్థానానికి.

2

గంటపొద్దు గడిచేసరికి, శవం చుట్టూ బోలెడుమంది జనం పోగయినారు. అందులో చాలామంది పట్నవాసపు రొదలో నిరుద్యోగంగా తిరిగే మధ్యతరగతి వారూ, రోజు కూలీ చేసుకుబతికేవారున్నూ వీరందరూ పొద్దుపోక అలా పోగుబడి తమ తమ అభిప్రాయాల్ని వెలిబుచ్చుతున్నారు.

ఒకాయన, ''అంతా ఒకరోజున పొయ్యేవాళ్ళమే లే అమ్మా! ఏడవకు. మీదసలేవూరు?'' అని ప్రశ్నించాడు ఏడుస్తున్న అమ్మాయిని.

''మాది దచ్చాది బాబూ'' అన్నది ఆ అమ్మాయి బొంగురుపోయిన గొంతుకతో. ''పాపం! ఇతనికిక్కడ పోవాలని రాసివుంది గామాలు!'' అన్నాడాయన. జేబులోంచి ఓ పావలాకాసు తీసి శవంపక్కన పారవేశాడు పోతూ పోతూ.

ఇంకో పైజామా ఆయన, '' ఇతను నయం, మంచివూర్లో చచ్చాడు. నేను రాయలసీమలో చూచాను; మొన్నటి కరువప్పుడు, ఎన్నిశవాలు దిక్కూ మొక్కూ లేకండా పడివుండేవని!'' అన్నాడు, గుంపులో ఎవర్నీ ఉద్దేశించకండానే.

ఎవరో ''పాపం!'' అన్నారు.

''పాపమేమిటండి! దారుణం అనండి. డెల్టా జిల్లాల్లో చస్తే దహన సంస్కారానికైనా చందాలు దొరుకుతాయి. అక్కడ అదీకరువే; ఒకడుచస్తే వాడిభాగం తనకొస్తుందిగదా అనుకుంటారు ఇతరులు!'' అని చప్పరించాడు. తరువాత జేబులు తడుముకున్నాడు ''కానీ'' తగిలింది. ఇతరత్రా జేబంతా ఖాళీగావుంది. అతను కొంచెం సిగ్గుపడుతూనే ఆ కానీ తీసి శవంమీదికి విసిరేసి సర్దుకున్నాడు.

ఆ వొంతెన వూర్లోంచి వచ్చే రోడ్డుమీద వుంది గనక రాకపోకల వొత్తిడి జాస్తి. అటునుంచి సైకిల్‌మీద వొచ్చిన అర్జునరావు తన స్నేహితుడైన పోలీసు బీట్‌లో వుండడంతో సరాసరి అక్కడికేవచ్చి ఆగి, '' ఏమిటి మిస్టర్: ఆ గందరగోళం'' అని ప్రశ్నించాడు వంతెనకేసి చూస్తూ.

వీరయ్య బీడీ వెలిగించి, '' ఎవడో చచ్చాడు. చందా వసూలు చేస్తున్నారు'' అన్నాడు చాలా నిర్లక్ష్యంగా.

''ఆ! ఎంత ఘోరం! నడివీధిన మనుష్యులు చనిపోవటమా! ఏం దేశమండి...'' అని విసుక్కుంటూగా సైకిల్ పోలీసు గొడుగుకు ఆనించి - శవంవున్న మూలకు పరిగెత్తాడు అర్జునరావు. అతను చాలా సున్నితమైన మనిషి. అప్పుడప్పుడూ, భావ కవిత్వం రాయటంకూడా కద్దు.

అతను గుంపును తొలగమని తొంగిచూచాడు. ఆ అమ్మాయి శవంకంటే ముందుగా అతని దృష్టినాకర్షించింది. చవక బారు చీర కట్టుకొన్నది. అదైనా అన్నీ చిరుగులు ఆమె ఏడ్పులోనూ ఎంతో అందంగా అగుపించింది అర్జునరావుకి. అర్జునరావు సినీ పత్రికలూ, సెక్సుపత్రికలూ చదవటంలో ఉత్సాహిఅయినా, అతని అంతరాత్మ ఇప్పుడు ఎదురు తిరిగిచివాట్లు పెట్టింది.

ఆమె ఇప్పుడున్న పరిస్థితుల్లోగాక మంచి పరిస్థితుల్లో వుంటే ఎలావుంటుందో అని ఊహించసాగాడు అర్జునరావు. వెధవమనస్సు. అందమైన ఆడది ఏ స్థితిలో ఉండి కనపడ్డా అటే చూస్తుందిగాని, ఆమె జాలిగొల్పే పరిస్థితిని అవగాహన చేసుకోదు గదా!... ఆ శవం ఏ పరిస్థితిలో వుందో! ఏ బొమికల పోగు పడివుందో మానవాకారంలో!

అర్జునరావు కొంచెం కంపించాడు. ఏ కుష్ఠురోగంతో, క్షయతో కృశించి చనిపోయాడో అతను! ఒక వేళ తిండి లేక ఆకలిచే వికవికలాడి చచ్చాడేమో! చచ్చాడనగానే అంత్యక్రియలకి ప్రతివాడూ తోచినదంతా ఇస్తున్నాడుగదా! ఇంతటితో సరి, ఇక వీళ్ళకివ్వక్కరలేదని కావును! ఛీ! ఛీ! మానవజాతి ఎంత కరుణారహితంగా ఆలోచిస్తుంది.

అర్జునరావు పది నిమిషాలు లోలోపల ఊహిస్తూ తనకు కనపడుతున్న దృశ్యాన్ని పోలుస్తూ నిల్చున్నాడు.

శవంమీద ఈగలు వాలుతుంటే తోలుతున్నారు ఆ స్త్రీలిద్దరూ. కాన్లూ, అణాలు, పావలాలూ పడివున్నాయి శవం పక్కన పరిచిన గుడ్డమీద. అర్జునరావు జేబు తడిమి ఒక బేడకాసు తీసి చాలా నమ్రతగా వొంగి శవంపక్కన పడేశాడు. అతనికళ్ళల్లో నీళ్ళే తక్కువ. అతను మెల్లగా నడిచి తిరిగి పోలీసుదగ్గరకువచ్చాడు. '' ఏం దేశం వీరయ్యా! శవాన్ని తగలెయ్యాలంటే చందా ఎత్తాల్సివస్తోంది గదా! - ఛీ! ఛీ!'' అన్నాడు నిష్కర్షగా.

''ఆః! పోనియ్యవోయ్. వెధవ న్యూసెన్సు. ఎవడైనా పైవాడొస్తే నాకు చీవాట్లు. ఇంకా ఎంతసేపు ఇలా కూచుంటారో వాళ్లు. మున్సిపాలిటీ వాళ్ల కప్పజెప్తే తీసికెళ్ళి పారెయ్యరూ?'' అన్నాడు వీరయ్య విసుగ్గా.

అర్జునరావుకికోపంవచ్చింది. అది వీరయ్యమీద; తర్వాత ఈ వ్యవస్థమీద, ఆర్థిక హెచ్చుతగ్గులమీద. తిరిగి వీరయ్యమీదే నిల్చిందా కోపం. ''వీరయ్యా! నువ్వు మనిషివేనా! శిలవి, కంచుబొమ్మవి. నీలో మానవత్వం లేదా? ఏమిటంత నిర్దయగా మాట్లాడుతున్నావు?'' అని కసురుకొన్నాడు.

వీరయ్య నవ్వుతూ, '' నువ్వేమైనా అనుకోవోయ్. ఎవణ్ణేనా బ్రతికున్నప్పుడే వీలైనంతవరకు కనికరించాలి, సాయం చెయ్యాలిగాని, చచ్చింతర్వాత వినాదాలు చెయ్యటం చందాలు వెయ్యటం ఘోరం!'' అన్నాడు - అర్జునరావు భుజంతట్టి. అర్జునరావుకీ మాట ఛాలెంజిలాగా తగిలింది. ఏమి సమాధానం చెప్పాలో తోచలేదు. ''వెళ్తున్నానోయ్ వీరయ్యా!'' అంటూ సైకిలెక్కి పోతూ పోతూ ఒకసారి తిరిగి శవాన్నీ, అమ్మాయినీ చూసి వెళ్ళిపోయినాడు.

## 3

పోలీసు అలా భోజనానికి వెళ్ళకుండా నాలుగుసార్లు కాఫీత్రాగి ఐదుగంటలకు డ్యూటీ దిగిపోయినాడు. ''డ్యూటీ'' దిగినా అతడు పక్కనేవున్న బీడీకొట్లో కూర్చుని, కొంచెం పొగాకు కొనుక్కుని చుట్ట చుట్టుకోసాగాడు.

అదే సమాయానికి అర్జునరావు వొంతెనమీదుగా సైకిల్‌మీద వొచ్చి బడ్డీకొట్టు బల్లమీద కూర్చునివున్న వీరయ్యను పెట్రోమాక్సులైటు వెలుగులో గుర్తుపట్టి అక్కడకు వచ్చి ఆగాడు. ''ఏమిటి వీరయ్యా! ఇంకా ఇక్కడే వున్నావు? ఇంటికి వెళ్ళలేదు?'' అని అడిగాడతను.

''లేదోయ్, ఏమిటో బద్దకంగావుండి కూర్చుండిపొయ్యాను'' అన్నాడు వీరయ్య.

అర్జునరావు ఉదయం తానుచూసిన శవం గుర్తుకొచ్చి వంతెనవేపు చూశాడు. ఇప్పుడక్కడ ఏమీలేదు. అతను ఎంతో జాలిగా, వీరయ్య వేపు తిరిగి '' ఈ పాటికి శవదహనం జరుగుతూ వుండొచ్చు. పాపం ఆ యిద్దర్నీ అనాధలుగా ఒదిలేసి వాడిదోవన వాడు పోయినాడు'' అన్నాడు; అతనిగొంతులో ఆ నిమిషాన భారతీయవేదాంతసారమంతా పలుకుతున్నట్లు తోచింది వీరయ్యకు.

వీరయ్య, నోటిలో చుట్టతీసి తుపుక్కున ఉమ్మేసి, ఎదురుగా దెయ్యంలా చీకట్లో తలలూపుతున్న పెద్ద రావిచెట్టు కొమ్మల కేసి చూస్తూ, ''నీకెంతో జాలేసింది గాబోలు!'' ఎంత చందా ఇచ్చావేం? అని అడిగాడు.

అర్జునరావు '' ఎంత అయితే ఏం? మనశక్తికొద్దీను! బేడో పావలో!'' అన్నాడు. వీరయ్య పక పక నవ్వాడొక సారి మనసారా. తర్వాత ''అర్జునరావు! నేనిందాక ఏదో అన్నానని నువ్వు మనసు కష్టపెట్టుకున్నావు కదూ?....'' అన్నాడు. అర్జునరావు ''అవునుమరి! నువ్వు వాళ్ళనుచూసి జాలిపడకపోగా అథార్టీచేస్తుంటివి! అందుకు'' అని ఆగాడు.

వీరయ్య మళ్ళీ నవ్వి. ''అందుకే తిరిగి నేనొకమాట అంటాను. ఏమనుకోకేం! మనం బతికున్న వాళ్ళని కనికరించం అర్జునరావూ! వాడే చచ్చాడనగానే చందాలు కురిపిస్తాం. వీలయితే స్మారకసభలుచేస్తాం. పెద్దస్థూపాలు నిర్మిస్తాంగూడా. ఈ సంగతి ఆ ఆడవాళ్ళకికూడా తెలిసివుండటం విశేషం!'' అన్నాడు.

దీని అర్థం ఏమిటో అర్జునరావుకి మొదట ఏమీ బోధపడలేదు. కాని రెండు నిమిషాలు ఆగి కొంచెం అర్థమై '' ఏమిటీ! ఏమిటీ నువ్వనేది?'' అని ఆదుర్దాగా అడిగాడతను.

వీరయ్య, ''మరేమీ లేదు! చీకటి పడగానే వీళ్ళు వాణ్ణి ఎత్తుకుని అలాగా కొంత మేర వెళ్ళారు; నేనుచూస్తూనే వున్నానులే. ఆ ఒంతెనకింద మెట్లుదిగాక వెధవ లేచి నడవసాగాడు.., అంతే; అయితే నా కింకా ఆశ్చర్యమేమిటంటే ఆ ఆడవాళ్ళిద్దరూ బ్రతికున్న వాణ్ణి ముందేసుకుని చచ్చినవాడికై ఏడ్చినట్టే ఏడ్చారు చూడు!...'' అన్నాడు నవ్వుతూ.

''కూటికొరకు కోటివిద్యలు!'' అనుకుంటూ అర్జునరావు వెళ్ళబోతూంటే వీరయ్య అతన్ని ఆపి, ''లోకం తనను తాను మభ్యపెట్టుకుంటుంది. ఆ లోకాన్నే మభ్యపెట్టడం కొందరి కవుసరం అవుతుంది'' అన్నాడు.

*(కథావాహిని, 1955)*

F18129